
ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో వనం దీక్షిత

ఘనంగా బాలల దినోత్సవం

గోల్కొండ: టోలిచౌకీ సూర్యనగర్ కాలనీలోని రవీంద్రభారతీ పాఠశాలలో చిన్నారులు చిల్డ్రన్స్ డే సందర్భంగా ఆడిపాడి ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ శశికళ మాట్లాడుతూ.. పండిత్ నెహ్రూ పిల్లలను ఎంతగానో ప్రేమించేవారని అందువల్లే పిల్లలు ఆయనను చాచా నెహ్రూగా పిలిచే వారన్నారు

మురాద్‌నగర్‌లో...

మురాద్‌నగర్‌లోని ఆర్‌బీఎస్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఫ్యాన్సీ డ్రెస్‌లతో అందరిని ఆకట్టుకున్నారు. మెహిదీపట్నం జోన్ డీస్ ప్రియామనీష్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి, డీఐ మధు, నస్రీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సెయింటాన్స్ గర్ల్స్ హై స్కూల్‌లో..

జాఫర్‌గూడలో..

అబిడ్స్: బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు బండారి వెంకటేష్ జాఫర్‌గూడతో పాటు పలు పాఠశాలల్లో విద్యార్థులకు స్టేషనరి, చాక్లెట్లు పంపిణీ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శివరాజు, విఠల్, సాయికృష్ణ పాల్గొన్నారు.

విజయనగర్‌కాలనీలో..

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ సెయింటాన్స్ బాలికోన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉపన్యాసాలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ సిస్టర్ ఆరోగ్యమేరి, కరస్పాండెంట్, సిస్టర్ రోజీ ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

ఫలక్‌నుమాలో..

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ శివాజీనగర్‌లోని శాంతి నికేతన్ పాఠశాల విద్యార్థులు బాలల దినోత్సవాన్ని ఫలక్‌నుమాలోని రెయిన్‌బో హోంలో చిన్నారుల నడుమ జరుపుకొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రతాప్ శాలినీ ఆధ్వర్యంలో చిన్నారులకు బహుమతులు, మిఠాయిలు, టపాకాయలు అందజేసి కేక్ కట్ చేశారు.

బహదూర్‌పురాలో..

బహదూర్‌పురా: సెయింట్ మార్క్స్ బాయ్స్ స్కూల్‌లో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఆకట్టుకున్నారు. బ్రదర్ శౌరెడ్డి, ఆంటోని, ఎడ్వర్డ్ పాల్గొన్నారు.

గౌలిపురాలో..

గౌలిపురా: విజ్ఞాన్ మోడల్ స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థిని వనం దీక్షిత ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో ఆకట్టుకుంది.


వేడుకల్లో బండారు వెంకటేష్ ముదిరాజ్ తదితరులు



టోలిచౌకీ రవీంద్రభారతీ స్కూల్‌లో


సెయింట్ మార్క్స్ బాయ్స్ స్కూల్‌లో..


రెయిన్‌బో హోంలో.. శాంతి నికేతన్ విద్యార్థులు

'మత తత్వ పార్టీలతో కార్వాన్ ప్రజలు విసిగిపోయారు'


మిత్రకృష్ణకు హారతులు పడుతున్న మహిళ

జియాగూడ: మత తత్వ పార్టీలతో కార్వాన్ ప్రజలు విసిగిపోయి సెక్యులర్ భావాలు గల బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. మంగళవారం జియాగూడలోని రంగనాథ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం కంచికామాక్షి, మల్లన్న గుడి, కురుమబస్తీ, లక్ష్మీనర్సింహనగర్, వేంకటేశ్వరనగర్, దుర్గానగర్‌లలో ఇంటింటికీ వెళ్లి ఓటువేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నరహరిచారి, కార్వాన్ యూత్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, సీనియర్ నాయకుడు శ్రీనివాస్ గుప్తా, జడల మోహన్, సి.బాబు, రఘునాథ్, నర్మద, సంగీత, అమృత తదితరులు పాల్గొన్నారు.

'గోషామహల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా'


ధూల్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సునీతారావు

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఆరు గ్యారంటీలు అమలు చేసి అన్నివర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు పేర్కొన్నారు. మంగళవారం ధూల్‌పేట పరిసర ప్రాంతాల్లో ఆమె ముమ్మరంగా ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ..తమ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేరుస్తామన్నారు. కాంగ్రెస్ గెలుపుతోనే ప్రజా సంక్షేమం జరుగుతుందన్నారు. రూ.500 లకే సిలిండర్, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. బీఆర్ఎస్, బీజేపీల మాటలను ప్రజలు నమ్మవద్దని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోకరణ్‌సింగ్, కిషన్, శ్యామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సదర్ ఉత్సవాలు

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో యాదవులు సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించి ఐక్యతను చాటుతారని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి నియోజకవర్గంలోని పలుచోట్ల నిర్వహించిన సదర్ ఉత్సవాలకు హాజరై దున్న రాజాలకు పూజలు నిర్వహించారు. అనంతరం మిత్రకృష్ణ మాట్లాడుతూ..యాదవులు పండగలలో సదర్ వేడుకలను ఎంతో పవిత్రంగా భారీ ఎత్తున నిర్వహించడం హర్షణీయమన్నారు. కురుమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, అభిషేక్, విజయ్ ముధిరాజ్, హరి, ఉమేష్ పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో..

గోల్కొండ: గోల్కొండ, లంగర్‌హౌస్, గుడిమల్కాపూర్, కార్వాన్ తదితర ప్రాంతాల్లో యాదవులు భారీ ఎత్తున సదర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తమ దున్నలను ఎంతో అందంగా అలంకరించి వాటితో విన్యాసాలు చేయించారు. గుడిమల్కాపూర్‌లో జరిగిన ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు జీవన్‌సింగ్, బీజేపీ నాయకులు సునీల్‌యాదవ్ పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న మిత్రకృష్ణ, అరుణ్‌కుమార్

ఆకట్టుకున్న సదర్ మేళా...

చార్మినార్: పాతబస్తీలో జరిగే ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్‌కుమార్ అన్నారు. దూద్‌బౌలీలో జరిగిన సదర్ మేళా ఆకట్టుకుంది. భానుచందర్ యాదవ్, రాజు యాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలోని ఇరు వర్గాల ప్రజలు కలిసి మెలిసి ఉత్సవాలు నిర్వహించుకోవడం శతాబ్దాలుగా వస్తోందన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం

అబిడ్స్: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు తొమ్మిది నెలలుగా అందించిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం భారీ మెజార్టీతో విజయం సాధించి హ్యాట్రిక్ పొందడం ఖాయమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు సీఎం కేసీఆర్ సంక్షేమం, అభివృద్ధి, ప్రగతికి మద్దతు పలుకుతున్నారన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి తలసానికి గిఫ్ట్‌ప్యాక్ అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి తలసాని మాట్లాడుతూ..గోషామహల్, సనత్‌నగర్‌లతో పాటు రాష్ట్ర నలుమూలల బీఆర్ఎస్ విజయ ఢంకా మోగిస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఆ రెండు పార్టీలను ప్రజలు ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో అభివృద్ధికి ప్రజలు పట్టం కడుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.నందుకుమార్, సురేష్ సింగ్, మాజిద్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి తలసానిని కలిసిన బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్

'ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే'


ప్రచారంలో కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ తదితరులు

చార్మినార్: ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. చార్మినార్‌లో కూడా ఈసారి కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన చార్మినార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల మద్దతు తమ పార్టీకే ఉందన్నారు. ముజీబుల్లా షరీఫ్‌కు ఆయన సత్కరించారు.

'రాజాసింగ్‌కు పరాభవం తప్పదు'



మాట్లాడుతున్న దాసోజు శ్రవణ్, దామోదర్‌గుప్తా, శోభన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రావు

అబిడ్స్: మతాల మధ్య చిచ్చుపెడుతూ లబ్ధి పొందే రాజాసింగ్‌కు ఈ ఎన్నికల్లో పరాభవం తప్పదని నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జి, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎన్నికల కో ఆర్డినేటర్ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. గోషామహల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్‌వ్యాస్ బిలాల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జీలు మోతే శోభన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రావు, మహ్మద్ వహీద్, కోలేటి దామోదర్‌గుప్తా, ఆశీష్‌కుమార్‌యాదవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజాసింగ్ కేవలం మతాల మధ్య విద్వేశాలు సృష్టిస్తూ లబ్ధి పొందారన్నారు. అభివృద్ధి, ప్రగతి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు రాజాసింగ్‌ను ఓడించేందుకు నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను బరిలోకి దించారన్నారు. నిరంతరం 25 ఏళ్లుగా ప్రజాసేవ చేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను ప్రతి ఒక్కరూ గెలిపించేందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గ ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేస్తున్నామన్నారు. త్వరలోనే మేనిఫెస్టోను విడుదల చేస్తామని శ్రవణ్ వివరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, కొమ్ముల నరేందర్, ఆనంద్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఖజానా పంపిణీ



చార్మినార్: దీపావళిని పురస్కరించుకుని మీరాలంమండి మహంకాళి ఆలయంలో అమ్మవారి ఖజానా పంపిణీ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ పంపిణీ కార్యక్రమానికి అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం రాత్రి జరిగిన పంచ హారతి లో భక్తులు పాల్గొని అమ్మవారి దివ్య దర్శనం పొందారు.

అగ్ని ప్రమాద మృతులకు అంత్యక్రియలు

నాంపల్లి: బజార్‌ఘాట్ బాలాజీ అపార్ట్‌మెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండవ అంతస్తులో మృతి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురికి కుతుబ్‌షాహీ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. మూడవ అంతస్తులో మృతి చెందిన భార్యాభర్తలకు చాదర్‌ఘాట్ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. మంగళవారం ఉదయం ఫజర్ నమాజ్ సమయంలో ప్రత్యేక ప్రార్థనలు పూర్తయ్యాక చివరి మజిలీ కార్యక్రమాలు పూర్తి చేశారు. ఈ అంత్యక్రియలకు ఏఐఎంఐఎం నాంపల్లి నియోజకవర్గం అభ్యర్థి మాజిద్ హుస్సేన్ హాజరై వారి బంధువులను, కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఆర్మీ అధికారి ఆత్మహత్య

లంగర్‌హౌస్: ఆర్మీ అధికారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పంజాబ్‌కు చెందిన రాజేంద్రసింగ్(40) లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎండీ లైన్స్‌లో ఉన్న మిలిటరీ క్వార్టర్స్‌లో హెడ్ కానిస్టేబుల్ హోదాలో పని చేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఆయన తన క్వాటర్స్‌లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య, పిల్లలు రాష్ట్రంలోనే వారి స్వస్థలంలో ఉంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి రిమాండ్

సంతోష్‌నగర్: తాళాలను పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను ఐఎస్‌సదన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. షాహీన్‌నగర్‌కు చెందిన హబీబ్ మహమ్మద్ అలియాస్ చోటు (35), షాహీన్‌నగర్ అలీనగర్‌కు చెందిన మహ్మద్ ఇబ్రహీం (40)లు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నెల 6న రాత్రి 10.10 గంటలకు న్యూ సంతోష్‌నగర్ కాలనీకి చెందిన సయ్యద్ ముజాహిద్ అహ్మద్ కుటుంబసభ్యులతో కలిసి బహదూర్‌పురాలో వివాహానికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన హబీబ్ మహమ్మద్, మహ్మద్ ఇబ్రహీం ముజాహిద్ ఇంటి తాళాలను పగలగొట్టి ఇంట్లో దొంగతనం చేశారు. 7న తెల్లవారుజామున 3.40 గంటలకు ముజాహిద్ కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలోని 11 బంగారు నెక్లెస్, 51 బంగారు రింగులు, 27 చెవి రింగులు, 12 గాజులు, 4 కడీలు, 1 బ్రాస్లెట్, రూ.80 వేల నగదు, 300 యూఎస్ డాలర్లతో పాటు ఇతర రోల్డ్ గోల్డ్‌లను దొంగతనానికి గురయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులు హబీబ్ మహమ్మద్, మహ్మద్ ఇబ్రహీంలు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు, యూఎస్ డాలర్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

గౌలిపురా: ఈసారి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ యాకుత్‌పురా నియోజకవర్గం అభ్యర్థి కె.రవిరాజ్ అన్నారు. మంగళవారం గౌలిపురా డివిజన్‌లోని ఎస్సార్టీ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఆయన నాయకులు, కార్యకర్తలతో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఈసారి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, మామాడి కృష్ణ, పి.రాజుయాదవ్, మామిడాల శ్రీనివాస్, డీసీఎం శ్రీనివాస్, లడ్డూ పటేల్, వెంకటమ్మ, అన్నపూర్ణ, దేవి పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న రవిరాజ్

గోషామహల్‌లో బీజేపీని ఓడించండి


మోతె శోభన్‌రెడ్డిని సత్కరించిన ముఖేష్ సింగ్

అబిడ్స్: గోషామహల్‌లో బీజేపీ చిత్తుగా ఓడడం ఖాయమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి మోతే శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్లుగా ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయకుండా మోసం చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్ ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని ప్రజలు పేర్కొంటున్నారని ఆయన అన్నారు. ధూల్‌పేట్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్ ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శోభన్‌రెడ్డి మాట్లాడుతూ..ధూల్‌పేట్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో అన్ని వర్గాల ప్రజలు సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'


అంద్రూన్ కార్వాన్‌లో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్‌బిన్

గోల్కొండ: వచ్చే ఎన్నికల్లో ప్రజలు అధికార బీఆర్ఎస్ పార్టీని తిరస్కరించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తారని కార్వాన్ కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మహ్మద్ ఆజీరి అన్నారు. మంగళవారం ఆయన కార్వాన్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇళ్లతో పాటు షాపులలో కూడా తిరిగి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పూర్తిగా దివాలా తీసిందని ఆయన ఆరోపించారు. ఏదేమైనా కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట వేణుగౌడ్, అమ్జద్ తదితరులున్నారు.

ఉమ్రాకు వెళ్లిన రెండు కుటుంబాలు సేఫ్

నాంపల్లి: బజార్‌ఘాట్ బాలాజీ అపార్ట్‌మెంట్ మొదటి, అంతస్తులోని రెండు కుటుంబాలు సురక్షితంగా బయటపడ్డాయి. టీ, కాఫీ పొడి వ్యాపారం చేసుకునే జయప్రకాష్ లడ్డా కుటుంబం, మందుల షాపు నిర్వాహకుడు యాసర్ కుటుంబం అగ్ని ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. జయ ప్రకాష్ లడ్డా కుమారుడు ఉదయాన్నే నిద్రలేచి వరండాలోకి రాగానే ఎగిసిపడుతున్న మంటలను చూశాడు. ఈ విషయాన్ని తండ్రి జయప్రకాష్ లడ్డాకు చెప్పగా వెంటనే తేరుకుని భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిని సురక్షితంగా పక్కింటిలో నుంచి కిందకు దించేశారు. అలాగే అరుపులు కేకలు విన్న పక్కింటి యాసర్ కుటుంబంలోని పది మంది కుటుంబ సభ్యులు ఒక్కొక్కరు నిచ్చెన సాయంతో కిందకు జారుకున్నారు. అలాగే రెండవ అంతస్తులోని ఫ్లాట్ నం–202లో నివసించే మహ్మద్ ఆజం(58), ఆయన భార్య రెహానా సుల్తానా(50), కుమారుడు హసీబ్ ఉర్ రెహమాన్(32), చిన్న కుమార్తె ఫైజా సమీన్(26), పెద్ద కుమార్తె తహూరా ఫరీన్ (35), ఈమె కుమార్తెలు తోబా(6), తరోబా(13), మూడవ అంతస్తులోని ఫ్లాట్ నం-302లో నివసించే భార్యాభర్తలు జకీర్ హుస్సేన్(66), నిఖత్ సుల్తానా(55) సజీవ దహనం అయ్యారు. గాఢ నిద్రలో ఉన్నందున రెండు, మూడు అంతస్తుల వారు తమ ప్రాణాలను కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. 201, 301 ఫ్లాట్స్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం లేకుండా పోయింది. నాల్గవ అంతస్తులోని రెండు ఫ్లాట్స్‌లలో నివాసం ఉండే వారు ఇటీవలే ఉమ్రాకు బయలుదేరి వెళ్లారు. దీంతో వారు ప్రాణాల నుంచి బయటపడ్డారు.

కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయం

గౌలిపురా: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్ఎస్ యాకుత్‌పురా నియోజకవర్గం అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గౌలిపురా డివిజన్‌లోని దానయ్యనగర్, అంబికానగర్, హనుమాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీ సంఘాలు, ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయన్నారు. కారు గుర్తుకే ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీఎం ప్రవీణ్ రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.దేవేందర్, సీనియర్ నాయకులు తిరుపతి శివ కుమార్, బొడ్డు సాయిబాబా, నర్సింహగౌడ్, శారద, శైలజా గౌడ్, శ్రావణి, తరంగిణి, సంతోష్, రాఘవేంద్ర, నందు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో సామ సుందర్ రెడ్డి

గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా


ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి బోయ నగేష్

చాంద్రాయణగుట్ట: తనను గెలిపిస్తే చాంద్రాయణగుట్ట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి బోయ నగేష్ అన్నారు. జంగమ్మెట్ డివిజన్‌లోని ఛత్రినాక, శివగంగానగర్, లక్ష్మీనగర్, రాజన్నబావి ప్రాంతాల్లో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలలో మహాలక్ష్మీ ద్వారా ప్రతి నెల మహిళలకు రూ.2500, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. రైతు భరోసా కింద రైతులకు ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, వరి పంటకు రూ.500ల బోనస్ ఇస్తామన్నారు.

సాహితీ సేవా పురస్కారం ప్రదానం

సుల్తాన్‌బజార్: భాషానిలయం మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎమ్మెల్యే నరసింహారావు జయంతి సభ మంగళవారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కవి, రచయిత డాక్టర్ ప్రాన్‌రావుకు ఎమ్మెల్యే ఎం.ఎల్.నరసింహారావు సాహితీ సేవా పురస్కారాన్ని డాక్టర్ కేవీ.రమణాచారి ప్రదానం చేశారు. ఆయన రచించిన తరతరాల తెలుగు ప్రముఖులు అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ రామారావు, బీఆర్.రావు, చంద్రశేఖర రావు, భాషానిలయం గౌరవ కార్యదర్శి ఉడయవర్లు పాల్గొన్నారు.

సంగీతంపై మక్కువ కలిగించాలి

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరాన్ని విద్యతో పాటు సంగీత కళలలోనూ ప్రోత్సహించాలని ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.పి. పట్నాయక్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ లక్ష్మణాచారి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ ఆధ్వర్యంలో సుస్వర రాగ సౌరభం పేరిట యూట్యూబ్ ఛానల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు పీపీ సాయిబాబా, గాయని విజయలక్ష్మి శర్మ, గురువు రామాచారి, సంస్థ వ్యవస్థాపకురాలు శశికళస్వామి పాల్గొన్నారు.


విద్యార్థులతో ఆర్‌పీ పట్నాయక్ తదితరులు

మజ్లిస్‌కు అన్ని వర్గాల మద్దతు: కౌసర్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సత్‌పాల్‌సింగ్ తదితరులు

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉన్నదని కార్వాన్ ఎమ్మెల్యే, మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ డివిజన్‌లోని బంజారాదర్వాజ, కటోరా హౌజ్, అటరాసిటీ, రేషంబాగ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనను బంజారా దర్వాజ వద్ద సత్‌పాల్‌సింగ్ తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తున్నానని అందువల్లే ప్రజలు తనను సంపూర్ణంగా మద్దతు పలుకుతున్నారని అన్నారు. కార్వాన్‌లో ప్రార్థన స్థలాలు, ఆలయాలు, హిందూ, ముస్లిం శ్మశానవాటికలు అభివృద్ధి చేశామన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, షకిల్ అలీ ఖాన్, మహ్మద్ హర్షద్ అహ్మద్ తదితరులున్నారు.

తలాబ్‌చంచలంలో మజ్లిస్ ప్రచారం

యాకుత్‌పురా: మజ్లిస్ పార్టీ యాకుత్‌పురా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మేరాజ్ మంగళవారం నియోజకవర్గంలోని తలాబ్‌చంచలం డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తలాబ్‌కట్టా, భవానీనగర్, సాలేంచౌక్, చాచాగ్యారేజ్, ఒవైసీ హెల్త్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఆయన కార్పొరేటర్ డాక్టర్ సమీనాబేగంతో ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ ప్రచారంలో యాసర్‌ఆరఫత్, మహ్మద్ మొహినుద్దీన్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ మేరాజ్

'మజ్లిస్ చేతిలో కారు స్టీరింగ్'


ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్

గోల్కొండ: హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలకే పరిమితమైన మజ్లిస్ పార్టీ అంటే కేసీఆర్‌కు భయం అని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్, కార్వాన్ డివిజన్‌లలో పాదయాత్ర చేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కారు కాలం మజ్లిస్ పార్టీ చేతిలో ఉందని ఆయన ఎద్దేవ చేశారు. స్వచ్ఛమైన పాలన కావాలంటే తనకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. అవినీతికి కేర్ ఆఫ్ అడ్రస్ బీఆర్ఎస్, మజ్లిస్‌లుగా మారాయని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు అశోక్‌కుమార్, సునీల్ యాదవ్ తదితరులున్నారు.